# దేహాభిమానం వీడి దేశసేవచేయండి!

మానవుడు శుద్ధుడు, బుద్ధుడు, నిరంజనుడు. కాని, తాను మోహమనే నిద్రలో మునిగినందువల్ల సంసారమనే స్వప్నమును గాంచుతున్నాడు. మోహమనే నిద్రను వదలితే సంసారమనేది స్వప్నమని తెలుస్తుంది.రక్తము, మాంసశల్యముల రాశియగు దేహము మీరు కాదు. సువ్యక్తముకాని కోరికల వ్యర్థ మనస్సు మీరు కాదు. ముక్తికి బంధకారమగు మోహపు భ్రాంతియు మీరు కాదు. మీ శక్తిని మీరెఱుంగగల శాశ్వతుడౌ పరమాత్మయే మీరు.

ప్రేమ స్వరూపులారా! నేటి యువకులే భావి భారతనేతలు, నవ సమాజ నిర్మాతలు. భావి నేతలైన యువకులపైననే దేశ భవిష్యత్తు ఆధారపడి యున్నది. దేశభక్తియే యువకుల శక్తి. సమాజసేవయే యువకుల కర్తవ్యం. యువతీ యువకులారా! ఇది మీరు నిద్రించవలసిన సమయం కాదు. స్వార్థము, సంకుచితమనే నిద్రనుండి మేలుకొని దేశసేవకై కంకణం కట్టుకోండి. సంకుచిత భావాలను దూరం నెట్టండి, విశాలమైన భావాలను పెంచుకోండి. భగవంతుడు మీకు మానవ జన్మను దేని నిమిత్తమై అందించాడో గుర్తించండి. ప్రతి జీవికి ఒక గమ్యమున్నది. అట్టి గమ్యాన్ని విస్మరించి కేవలం దేహసంబంధమైన భ్రాంతులతో కాలాన్ని వ్యర్థం చేసుకోకండి. సమాజసేవయే మీ కర్తవ్యమని, దేశక్షేమమే మీ దేహక్షేమమని గుర్తించండి. శీలమును పోషించుకోండి. కేవలం అన్నంకోసం కాక, ధర్మంకోసం బ్రతకండి. పశుపక్షిమృగాదులు సైతం తమ ధర్మాన్ని తాము అనుసరిస్తున్నాయిగాని, మానవుడు మాత్రం తన ధర్మాన్ని విస్మరిస్తున్నాడు. నేటి విద్యార్థులు తాము చదివే చదువులు కేవలం ఉద్యోగ నిమిత్తమని భావిస్తున్నారు. ఇది పెద్ద పొరపాటు. యోగంలేని ఉద్యోగం నిరుపయోగం. దైవచింతనయే నిజమైన యోగము, ఉద్యోగము. అదే మానవుని ప్రధానకర్తవ్యము. ఇట్టి యోగాన్ని విస్మరించి ఉద్యోగాన్ని చూసుకొని గర్వించటం తగదు. జీవితవృక్షానికి అహంకారమే వేరు పురుగు. రాగద్వేషాలు అహంకారానికి సహాయకారులు. ఈ మూడూ చేరి మానవత్వాన్ని నిర్మూలం గావిస్తాయి.

ఎవరు భగవంతుని విశ్వసిస్తారో, ఎవరు భగవంతుని ప్రేమిస్తారో, అట్టివారి జీవితం

sri sathyasai vachanamrutam

ఆనందంతో కళకళలాడుతుంది, కిలకిల నవ్వుతుంది. కాని ఏ మానవుడు భగవత్ప్రేమను విస్మరించి స్వార్థప్రేమయందు మునిగిపోతాడో అలాంటివాని జీవితము బాధతో విలవిల్లాడుతుంది. మలమల మాడుతుంది. భారతదేశం వేదాల పట్టుకొమ్మ, యజ్ఞ యాగాది క్రతువుల కాటపట్టు. వేదాలకు పుట్టినిల్లైన ఈ దేశం ఈనాడు వేదనకు గురిఅవుతున్నదంటే కారణమేమిటి? ప్రాచీనులు సత్యమే దైవమని విశ్వసించారు; త్యాగమును, ప్రేమను అభివృద్ధి పర్చుకొని ఎంతయో ఆనందమును అనుభవించారు. కాని ఈనాటి విద్యార్థులు, విద్యావంతులు కూడ ధనమే దైవమని భావిస్తున్నారు, అధికారంలోనే ఆనందమున్నదని భ్రమిస్తున్నారు.

**అన్నం బ్రహ్మ**

మానవునియందున్న దివ్యశక్తి ఇట్టిది, అట్టిది అని వర్ణించుటకు వీలుకాదు. అదియే విష్ణుశక్తి, అదియే బ్రహ్మశక్తి. వేదము "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అన్నది. త్రికాలములందు మార్పు చెందని, కూర్పు చెందని జ్ఞానమే బ్రహ్మతత్త్వము. వేదము "ప్రజ్ఞానం బ్రహ్మ" అని కూడ తెల్పింది. దీనినే Constant integrated awareness అన్నారు. ఈ బ్రహ్మనుండియే ఆకాశము, ఆకాశము నుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్నినుండి జలము, జలము నుండి పృథ్వి, పృథ్వినుండి ఓషధులు, ఓషధులనుండి అన్నము ఆవిర్భవించాయి. అన్నమునుండియే మానవుడు పుట్టాడు. ఈవిధంగా విచారణ చేసినప్పుడు మానవునికి, బ్రహ్మకు సన్నిహిత సంబంధ, బాంధవ్యమున్నదని స్పష్ట మవుతుంది. కనుకనే,కృష్ణుడు "మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః" (ఈ ప్రపంచమునందలి జీవులందరూ నా శాశ్వతాంశములే) అన్నాడు.

బ్రహ్మయే లేక ఆకాశమే లేదు; ఆకాశమే లేక గాలియే లేదు; గాలియే లేక అగ్నియే లేదు; అగ్నియే లేక జలమే లేదు; జలమే లేక పృథ్వియే లేదు; పృథ్వియే లేక ఓషధులే పండవు; ఓషధుల పంట లేక అన్నము లభించదు. మానవునికి అన్నమే మూలాధారం. దీనిని పురస్కరించుకొనియే వేదము "అన్నం బ్రహ్మ" అన్నది. బ్రహ్మ అనగా ఎవరు? మీరు పిక్చర్లలో చూసే చతుర్ముఖ బ్రహ్మ కాదు. బృహత్తరమైన శక్తియే బ్రహ్మ. సర్వత్ర వ్యాపించిన శక్తియే బ్రహ్మ. గాలియే బ్రహ్మ. నీరే బ్రహ్మ. భూమియే బ్రహ్మ, అగ్నియే బ్రహ్మ, ఆకాశమే బ్రహ్మ. పంచభూతములే బ్రహ్మ స్వరూపములు. అవన్నీ మానవ దేహమునందే ఉన్నవి. కనుక,

sri sathyasaivachanamrutam

మానవునికంటే దైవం ప్రత్యేకంగా లేదు. మానవుడే సాక్షాత్తు బ్రహ్మస్వరూపుడు. మానవుడే సత్యస్వరూపుడు. మానవత్వమునందే దైవత్వాన్ని ప్రకటించాలి. దైవత్వాన్ని ప్రకటించటమే మానవుడు చేయవలసిన సాధన.

**సత్ ఇ యమ్, సత్యం**

మీరు ఆహారమును భుజించేముందు "బ్రహ్మార్పణం....." అని ప్రార్థన చేస్తున్నారు. అయితే, బ్రహ్మ ఎక్కడున్నాడు? మీలోనే ఉన్నాడు. కనుకనే, మీ లోపలనుండి తక్షణమే "అహం వైశ్వానరో భూత్వా....." అని జవాబు వస్తున్నది. "నాయనా! నేను వైశ్వానరుడి రూపంలో నీలో ఉండి, నీవు భుజించే ఆహారాన్ని జీర్ణం చేస్తున్నాను. నేను నీకంటే వేరు కాదు" అని జవాబిస్తున్నాడు, భగవంతుడు. అన్నమంటే కేవలం మనం భుజించే పదార్థము కాదు. ప్రపంచమంతా అన్నమయమే! ఒక అన్నముచేత ఆవిర్భవించిన దేహము మరొక అన్నముచేత ఆవిర్భవించిన దేహాన్ని భుజిస్తున్నది. ఒక దేహము మరొక దేహానికి ఆహారంగా ఉన్నది. కనుక, భుజించేదీ అన్నమే; భుజింపడేది అన్నమే; సంపాదించేదీ అన్నమే, వినియోగం చేసేది అన్నమే. కనుకనే "అన్నం బ్రహ్మ" అన్నారు. అన్నమును సృష్టించేది సత్యము. సత్యమనే పదంలో సత్, ఇ. యమ్ అనే మూడు శబ్దములు చేరియున్నాయి. సత్ –జీవుడు, ఇ – అన్నము, యమ్. – సూర్యుడు. సూర్యునిచేతనే ఆహారపదార్థములు తయారౌతున్నాయి. ఆహార పదార్థములచేతనే మనిషి జీవిస్తున్నాడు. కనుక సత్యమే అన్నింటికీ మూలాధారం. మన ప్రాచీనులు సత్యధర్మములను ప్రాణసమానంగా భావించేవారు. కాని ఈనాటి మానవుడు సత్యాన్ని విస్మరిస్తున్నాడు, అన్నాన్ని ఆశిస్తున్నాడు. సత్యము లేక అన్నము లభించదనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు.

**'సోహం' అనగా 'నేనే దైవం' అని అర్థము**

ఈ క్రీడోత్సవంలో పిల్లలు అనేక ఆటలు ఆడారు, పాటలు పాడారు, విజయాన్ని సాధించారు. అయితే 'నేను సాధించాను' అని గర్వించకూడదు. తమయందున్న దివ్యత్వమే తమచేత ఇన్ని ఆటలు ఆడించింది, పాటలు పాడించిందని గుర్తించాలి. కొంతమంది పిల్లలు మునుపెన్నడూ ఆడని ఆటలు ఆడి విజయాన్ని సాధించారు; ఏనాడూ పాడని పిల్లలుకూడా పాటలు పాడుతున్నారు. ఇవన్నీ ఎక్కడి నుంచి వచ్చాయి? లోపలనుండియే వచ్చాయి. లోపల

sri sathyasai vachanamrutam

నివసించేది ఎవరు? దైవమే! ఈ సత్యాన్ని మీ ఉచ్ఛ్వాస నిశ్వాసములు "సో...హం" అని ప్రబోధిస్తున్నాయి. "సోహం" అనగా 'నేనే దైవం' అని అర్థం. దీనినే హంస గాయత్రి అన్నారు. దినమునకు 21,600 పర్యాయములు మీ అంతర్వాణి మీరే దైవం అని బోధిస్తున్నప్పటికీ ఈ సత్యాన్ని గుర్తించుకోలేక మీరు అల్పులమని, శక్తిహీనులమని భావిస్తున్నారు. మీరే సర్వశక్తిమయులు, సర్వవిజ్ఞానమయులు. ఈ విజ్ఞానమంతా మీరు చదువుకుంటే వచ్చిందని అనుకుంటున్నారు. చాల పొరపాటు. మీలో ఆ విజ్ఞానమే లేకపోతే మీరు దానిని గ్రంథములో ఏరీతిగా చదవగలరు? పెరుగు ఉంది, కవ్వముంది. కాని వెన్న లభిస్తుందా? పెరుగును చిలికినప్పుడే వెన్న లభిస్తుంది. అదేవిధంగా మీరు ప్రయత్నంచేత మీయందున్న అనంతమైన, అఖండమైన శక్తిని ఆవిర్భవింపచేసుకోవాలి. అది ప్రాప్తించాలంటే మనస్సును భగవత్ప్రేమవైపు ప్రయాణం చేయించాలి. ఈనాడు మీరు ఎందుకు దుఃఖిస్తున్నారు? ఎందుకు విచారిస్తున్నారు? కారణమేమిటి? మీ మనస్సు భగవత్ప్రేమవైపు ప్రయాణం చేయటం లేదు. భగవత్ప్రేమవైపు ప్రయాణం చేసినప్పుడే మీ జీవితం ఆనందంతో కళకళలాడుతుంది, కిలకిల నవ్వుతుంది.

**దైవభావంతో చేసే ప్రతి పని పూజతో సమానం**

ఎక్కడ చూసినా ఉన్నది బ్రహ్మయే. కనుక మీరు ఏది చేసినా భగవంతుని పనిగా విశ్వసించండి. యోగము వేరు, ఉద్యోగము వేరు అని భావించకండి. మీరు చేసే ఉద్యోగంలోనే యోగాన్ని అనుభవించండి. మీ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించండి. ఏ పని చేసినా దైవభావంతో చేయండి. అప్పుడు మీరు చేసే పనియే పూజగా మారుతుంది. కాని అట్టి భావము మీలో లోపిస్తున్నది. "ఇది నాపని, అది బయటివారి పని" అని భావిస్తున్నారు. బయటివారే లేరు, అందరూ ఒక్కటే. "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్ర పాత్" భగవంతుడు అనేక శిరస్సులతో, అనేక హస్తములతో, అనేక నేత్రములతో, అనేక పాదములతో ఉన్నాడు. కాబట్టి అన్ని శిరస్సులూ, అన్ని హస్తములూ, అన్ని నేత్రములూ, అన్ని పాదములూ భగవంతునివే! ఈ విశ్వమంతా విరాట్స్వరూపమే. భగవంతుడు లేని వ్యక్తి కానరాడు. ఆస్తికునియందుగాని, నాస్తికునియందుగాని, ఆస్తికనాస్తికునియందుగాని అందరియందూ దివ్యత్వం ఉంటుంది. న + అస్తి = నాస్తి. అస్తి లేక నాస్తి కావటానికి వీల్లేదు. అస్తి అనగా దైవత్వమే! కనుక నాస్తికునిలో కూడా దైవత్వం ఉన్నది.

## బ్రహ్మానందమనగా....

పదములయొక్క అర్థాన్ని గుర్తించకుండా వాటిని ఉపయోగించటం అజ్ఞానం. చాలమంది లౌకికమైన భోగభాగ్యాలను అనుభవిస్తూ "నేను బ్రహ్మానందంగా ఉన్నాను" అంటారు. బ్రహ్మానందమంటే ఏమిటో మీరు గుర్తించాలి. శారీరకమైన సుఖ సంతోషాలను మానవానందము అంటారు. మానవానందమునకు నూరింతలు అధికమైనది ఇంద్రానందము. ఇంద్రానందమునకు నూరింతలు అధికమైనది దేవేంద్రానందము. దేవేంద్రానందముకంటే నూరు రెట్లు అధికమైనది దేవానందము. దేవానందము కంటే నూరు రెట్లు అధికమైనది బృహస్పతి ఆనందము. బృహస్పతి ఆనందముకంటే నూరు రెట్లు అధికమైనది ప్రజాపతి ఆనందము. ప్రజాపతి ఆనందముకంటే నూరు రెట్లు అధికమైనది బ్రహ్మానందము. కనుక అప్పటికప్పుడు వచ్చి పోయేది బ్రహ్మానందముకాదు. బ్రహ్మానందము శాశ్వతమైనది. "బ్రహ్మానందం పరమ సుఖదం...." అదియే నిజమైన సుఖాన్ని అందిస్తుంది. దేహమునకు, మనస్సునకు సంబంధించిన సుఖం నిజమైన సుఖం కాదు. అది కదలిపోయే మేఘము వంటిది. జాగ్రత్, స్వప్న, సుషుప్తులందు కూడా మారని ఆనందమే బ్రహ్మానందము. బాహ్యమైన ఆనందము జాగ్రదవస్థలో మాత్రమే ఉంటుంది. నిద్రావస్థలో ఉండదు. స్వప్నావస్థలో ఉండదు. కాని బ్రహ్మానందము జాగ్రదవస్థలో ఉంటుంది, స్వప్నంలో ఉంటుంది, సుషుప్తిలో కూడా ఉంటుంది.

మానవుడు ఆనందపిపాసి. కాని తనయందు తుచ్ఛమైన, సంకుచితమైన, అల్పమైన భావములను చేర్చుకోవటంచేత దుఃఖానికి గురి అవుతున్నాడు. మానవుడు సంకుచితమైన భావములను త్యజించి విశాలమైన భావములను పెంచుకోవాలి. ప్రేమను అభివృద్ధి పర్చుకోవాలి. ప్రేమచేతనే ఆనందము లభ్యమౌతుంది. ప్రేమచేతనే మీరు అన్నివిధములైన సుఖాన్ని పొందగల్గుతారు. ప్రేమను మించిన ఆనందము మరొకటి లేదు. వేదము "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ...." అన్నది. మూడు కాలములందు మార్పుచెందని జ్ఞానమే బ్రహ్మ. ఇలాంటి నిత్యమైన దైవత్వం మీయందే ఉన్నది. దానిని మీరు అనుభవించాలంటే దేహాభిమానమును త్యజించాలి, ఆత్మాభిమానమును వరించాలి.

ఈ దేహము వస్తుంది, పోతుంది. ఇది ఎప్పుడు పోతుందో, ఎలా పోతుందో ఎవ్వరికీ

srisathyasaivachanamrutam

తెలియదు. ఇది కేవలం ఒక స్వప్నంవంటిది. కనుక దేహాభిమానమును పెంచుకోకూడదు. అయితే ఉన్నంతవరకు క్షేమంగా ఉండాలి; పరాధీనం కాకుండా బ్రతకాలి; మీ పనులు సక్రమంగా చేయాలి. దైవభావంతో జీవించాలి. అప్పుడు మీరే దైవమౌతారు.

**మితిమీరితే మతి చెడుతుంది**

విద్యార్థులారా! ఈనాడు దేశాన్ని పట్టి పీడిస్తున్న అన్యాయ, అక్రమ, అనాచారములను రూపుమాపటానికి మీరు కంకణం కట్టుకోవాలి. ఏవిధంగా వాటిని రూపుమాపాలి? వాటితో యుద్ధం చేయాలా? కాదు, కాదు. మీరు పవిత్రమైన భావములను అభివృద్ధి పర్చుకోవాలి; సత్యమును, ధర్మమును, న్యాయమును పోషించుకోవాలి. భావి భారతోద్ధారకులు మీరే! నవభారత నిర్మాణానికి దీక్ష పూనండి. గొప్ప చదువులు చదువుకున్నామని గర్వించకండి. ఈ చదువులు తాత్కాలికమైన జీవనోపాధికి మాత్రమే ఉపయోగపడతాయి. దైవాన్ని విశ్వసించండి, దైవాన్ని ఆశ్రయించండి. అప్పుడు మీ సర్వకార్యములు ఫలిస్తాయి. చదువులు చదివినంత మాత్రమున మీకు జ్ఞానం ప్రాప్తించదు.

చదువులన్ని చదివి చాల వివేకియై
మదిని తన్నెఱుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏరీతి నున్నను
హీను డవగుణంబు మానలేడు.
తరచి చదువు చదువ తర్కవాదమెగాని
పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు
చదువులన్ని చదివి చావంగ నేటికి
చావు లేని చదువు చదువవలయు!

చావు లేని చదువే నిజమైన చదువు. అదియే బ్రహ్మజ్ఞానము. దైవం సర్వత్ర ఉన్నాడనే జ్ఞానాన్ని సంపాదించుకోండి. అంతకంటే మించిన ఆనందము మరొకటి లేదు. అయితే భౌతికమైన చదువుకూడా ఉండవలసిందే! కాని, అది మితిమీరిపోతే మతిచెడిపోతుంది. మీరు దాహం తీర్చుకోవటానికి ఒక టంబ్లరు నీరు చాలు; గంగాజలమంతా కావాలని ఆశించటం వెఱ్ఱితనం కదా! “న శ్రేయో నియమం వినా”. సంపాదనకుగాని, వినియోగానికిగాని,

sri sathyasai vachanamrutam

భుజించడానికి గాని దేనికైనా ఒక పరిమితి ఉండాలి. అప్పుడే మీ జీవితం ఆనందమయంగా ఉంటుంది.

**దేశాభిమానం ఉండాలి, దేహాభిమానం తగదు**

విద్యార్థులారా! భౌతికమైన దేహారోగ్యమునకు, మానసిక వికాసమునకు ఆటలు, పాటలు అవసరమే. అయితే, మీ దేహాన్ని సమాజ సేవకోసం వినియోగించాలి. సేవ చేయని దేహం, విచారణ చేయని తల ఉండి ప్రయోజనమేమిటి? ఏ పనైనా చేసేముందు అది మంచిదా, చెడ్డదా అని విచారణ చేయాలి. మీ శారీరక, మానసిక , ఆధ్యాత్మిక శక్తులను దైవార్పితం గావించాలి. గొప్ప చదువులు చదివామని, విదేశాలకు వెళ్ళి గొప్పగా సంపాదిస్తామని భ్రమించకండి. నిజమైన సంపద మీయందే ఉన్నదని గుర్తించండి. మాతృదేశాన్ని మరువకండి. మీ జన్మభూమియే మీ తల్లి. మీ తల్లి కురూపియని ఆమెను వదలిపెట్టి అందంగా ఉన్న మరొక స్త్రీని తల్లియని పిలవటానికి వీలౌతుందా? విదేశాలపై మోజుతో మాతృదేశాన్ని విస్మరించటం అలాంటిదే! “జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి”. జనని, జన్మభూమి స్వర్గము కన్న మిన్నయైనవి. ఏదేశమువారైనా తమ దేశముపై అభిమానం కల్గియుండాలి. అయితే దేశాభిమానం పెట్టుకోండి గాని, దేహాభిమానం పెట్టుకోకండి. దేహం ఎలాంటిది?

పాంచ భౌతికము దుర్బలమైన కాయంబు
ఎప్పుడో కూలక తప్పదెందు
శత వర్షముల దాక మితము చెప్పిరిగాని
నమ్మరాదామాట నెమ్మనమున
బాల్యమందో మంచి ప్రాయమందో కాక
ముదిమియందో లేక ముసలియందో
ఊరనో అడవినో ఉదక మధ్యంబునో
ఎక్కడో విడిచేది ఎఱుక లేదు
మరణమే నిశ్చయమ్మది మానవునకు
బుద్ధిమంతుడై తన దేహమున్న యపుడె
తన్ను తా తెలియుట ధర్మతత్త్వ మరయ

sri sathyasai vahamrutam

తానెందుకు పుట్టాడో, ఎందుకు పెరిగాడో తెలుసుకోలేని మానవుడు తిండికి చేటు, భూమికి బరువనే చెప్పవచ్చు. మానవజన్మ ఎత్తినందుకు మీతత్త్వాన్ని మీరు గుర్తించాలి, మీ ధర్మాన్ని మీరు అనుసరించాలి. ఇతరులతో మీరు పోలిక పెట్టుకోకూడదు, ఇతరులను అనుకరించకూడదు. అనుకరణ మనో దౌర్బల్యాన్ని సూచిస్తుంది. ఎవరో ఒక వ్యక్తికి ఒకచోట డబ్బుల మూట చిక్కిందని నీకు తెలిసి, నీవు కూడ డబ్బులమూట చిక్కుతుందేమోనని ఆశతో అక్కడకు వెళితే నీ జేబులో ఉన్న డబ్బు పోవచ్చు! కనుక అనుకరణ అనేది చాల చెడ్డది. Imitation is a weakness; Creation is divine. ఈ సత్యాన్ని మీరు గుర్తించాలి. విద్యలో ఉన్నతస్థాయి చేరుకోవటానికి కొంత అనుకరణ చేయవచ్చునుగాని, మిగిలిన విషయాలలో అనుకరణ పనికిరాదు.

**"పరోపకారః పుణ్యాయ...."**

విద్యార్థులారా! మీ ఆటలు, పాటలు అందరినీ ఆనందపర్చాయి. అయితే మీరు క్షణక్షణమూ జీవితమనే ఆట ఆడుతూనే ఉన్నారు. ఆ ఆటలో విజయాన్ని సాధించండి. జీవితము చాలా విలువైనది, ఘనమైనది. ఇలాంటి జీవితాన్ని వ్యర్థం చేయకూడదు. కాలాన్ని వ్యర్థం చేస్తే జీవితాన్ని వ్యర్థం చేసినట్లే! కనుక, సత్కర్మలలో పాల్గొనండి. తోటి మానవులకు సహాయం చేయండి. "పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం". Help Ever, Hurt Never.

ఎల్లప్పుడు సహాయమే చేయండి. ఎవ్వరినీ బాధించకండి. కౌరవులు నిరంతరము పాండవులను బాధిస్తూ వచ్చారు. తత్ఫలితంగా కౌరవులకు ఏ గతి పట్టింది. నూరుమంది పుత్రుల తండ్రియైన ధృతరాష్ట్రునికి అంత్యంలో నీరు ఇవ్వటానికి ఒక్క పుత్రుడైనా మిగల్లేదు. ఈ విషయాన్ని కృష్ణుడు అర్జునునికి యుద్ధానికి ముందే చెప్పాడు:

లెమ్ము ధనంజయా! విధి బలీయము
న్యాయము గెల్చు, నశించు స్వార్థము;
సదా యుగధర్మ మిదే కదోయి; కన్గొమ్మిక
నంత్య కాలమున నూర్గురు బిడ్డల తండ్రికైన
పిండమ్మిడు దిక్కు కల్గరకటా!
గ్రహచారంబు తప్పివచ్చినన్



sri sathyasai vachanamrutam

దైవాన్ని విస్మరించి, లోకాన్ని విశ్వసించి కౌరవులు పొందిన సుఖం ఏమిటి? లోకంలో ఉన్నంతవరకు లోకాన్ని అనుభవించవలసిందే, అది వద్దని చెప్పను. కాని దానికొక పరిమితి ఉండాలి.

విద్యార్థులారా! మీరు ఆటపాటలతో ఎన్నో వేలమందికి ఆనందాన్ని అందించారు. అయితే, ఒక్క విషయాన్ని మీరు గుర్తించాలి. మిమ్మల్ని చూసి ఈవిశ్వమంతా ఆనందించినప్పటికీ ఒక్క దైవం ఆనందించకపోతే ప్రయోజనం లేదు. దైవం మీ వైపున ఉంటే విశ్వమంతా మీకు విరుద్ధమైనప్పటికీ మీరు వెఱువ నక్కర్లేదు. దైవం మీవాడైనప్పుడు జగత్తంతా సంతోషిస్తుంది. కనుక దైవాన్ని సంతృప్తిపర్చండి.

**దూపాటి తిరుమలాచార్యుల అనన్యభక్తి**

పూర్వం ఇక్కడ దూపాటి తిరుమలాచార్యులనే భక్తుడుండేవాడు. సుప్రభాతం వ్రాసినది అతడే. అతడు గొప్ప సంస్కృత పండితుడు, వెంకటగిరి సంస్థానంలో పనిచేశాడు. అతడు 90 ఏళ్ల వయస్సులో బదరీకి నాతో ప్రయాణమై వచ్చాడు. “తిరుమలాచారీ! నీదేహం చాల శుష్కించిపోయింది. అంతదూరం ప్రయాణం చేయగలవా?” అని అడిగాను. “స్వామీ! మీరు నావెంట ఉంటే ఎంత కాలమైనా, ఎంత దూరమైనా ప్రయాణం చేస్తాను. మీకు అయినవాడనైతే జగత్తుకంతా నేను అయినవాడనౌతాను. మీకు కానివాడనైతే నా జీవితమే వ్యర్థం”

“నీకు కానివాడనైతే లోకమాత!
నేనులోకమందు లోకువౌదు లోకమాత!’’

అన్నాడు. ఇంతటి భక్తి ప్రపత్తులతో జీవించినవాడు ఆ తిరుమలాచారి. అతడు తన కాలమంతా స్వామితోనే గడిపాడు. బృందావనానికి వెళితే అక్కడకూడా అతడు నాతోనే ఉండేవాడు. అతను చాల గొప్పభక్తుడు. ఆ భక్తికి ప్రమాణము చెప్పటానికి వీలుకాదు. కట్టకడపటికి అతనికి మరణంకూడా చాలా సునాయాసంగా లభించింది. ఒకరోజున “స్వామీ! ఇంక నా పని అయిపోయింది” అన్నాడు. “నీకెట్లా తెలుసు?” అన్నాను. “లోపలున్న మీరే నాకు బోధిస్తున్నారు” అన్నాడు. వెళ్ళి స్నానం చేశాడు, కొంత జలము తీసుకువచ్చి నా పాదాలకు అభిషేకం చేశాడు, నాలుగు బొట్లు తీర్థం తీసుకున్నాడు. “స్వామీ! ఇంక నేను పరిపూర్ణుడనైనాను.

srisathyasaivachanamrutam

పూర్ణమదః పూర్ణ మిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణ మేవావశిష్యతే!

నా దేహము, మనస్సు, ఆత్మ పరిపూర్ణమైపోయాయి. ఇంక మీలో చేరిపోతున్నాను" అన్నాడు, తన ప్రాణాలను వదిలాడు. చూశారా! తన మరణం ఎప్పుడు వస్తుందో ముందే తెలుసుకోగల్గాడు. అతడు నిరంతరము 'సాయిమాతా! సాయిమాతా!" అని స్మరించేవాడు. ఇలాంటి భక్తి కల్గినవారు లోకంలో ఎంతమందో ఉంటున్నారు. "జగతియందు పుణ్యపురుషులు లేకున్న జగము లెట్లు వెలుగు పగలుగాను!" ఇలాంటి పరమ భక్తులు ఉండటం వల్లనే జగత్తంతా దేదీప్యమానంగా వెలుగుతున్నది.

విద్యార్థులారా! మీరు ఎక్కడికి వెళ్ళినప్పటికీ సత్యాన్ని అనుసరించండి. ఇదియే మీరు మన ఇన్స్టిట్యూట్‌కి ఇవ్వవలసిన కృతజ్ఞత. మీరు ఎక్కడికి పోయినప్పటికీ, ఫలానా ఇన్స్టిట్యూట్‌లో చదివిన పిల్లవాడు మంచి పిల్లవాడు అని పేరు తెచ్చుకుంటే చాలు. చిన్న ఉదాహరణ: ఈ 'స్పోర్ట్స్ మీట్' కొఱకు కొంతమంది పిల్లలను గుఱ్ఱపు స్వారీ, గోకార్ట్ డ్రైవింగ్‌లో శిక్షణ పొందటానికి బెంగుళూరు పంపించాము. అక్కడ లెఫ్ట్‌నెంట్ జనరల్ మెహతా పిల్లలకు చాల సహాయం చేశాడు. పూనా నుండి గుఱ్ఱాలను తెప్పించాడు. ట్రైనింగ్ ఇచ్చేవారిని ఏర్పాటుచేశాడు. ఆ ట్రైనింగ్ ఇచ్చేవారు మన పిల్లల శక్తిసామర్థ్యాలను చూసి చాల ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేశారు. "ఈ పిల్లలకు ఎక్కడినుండి వచ్చిందో ఇంత శక్తి మాకు తెలియదు. నెలల కొద్దీ శిక్షణ పొందినా చేయలేని విన్యాసాలను ఈ పిల్లలు కేవలం పదిదినములలోనే నేర్చుకొని చేయగల్గు తున్నారు" అని వారు చాల ఆశ్చర్యపడ్డారు. "సత్యసాయి ఇన్స్టిట్యూట్ పిల్లలు చాల గుణవంతులు, విజ్ఞానవంతులు, ప్రకాశవంతులు" అని వారు వర్ణించారు. లోకంలో కొంతమంది పైకి తెల్లడ్రస్సు వేసుకుంటారుగాని, వారి మనస్సు చూస్తే నల్లగా ఉంటుంది. కాని, మన ఇన్స్టిట్యూట్ పిల్లలు వేసుకునే తెల్ల డ్రస్సుకు తగినట్లుగా వారి మనస్సుకూడ తెల్లగా ఉంటుందనే పేరు తెచ్చుకోవాలి. అదే నాకు సంతోషం.

విద్యార్థులారా! నేను ఎప్పుడూ మీ ఇంటనే, వెంటనే, జంటనే ఉంటున్నాను. మీరందరూ గుణవంతులై విజ్ఞానాన్ని, ప్రజ్ఞానాన్ని లోకానికి చాటండి. ఈనాడు దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో మీకు తెలుసు. ఎక్కడకు పోయినా అశాంతి, ఎక్కడ చూసినా దుఃఖము! ఈ అశాంతిని,

దుఃఖాన్ని దూరం చేయండి. ఇదే నేను కోరేది. మీ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వరిస్తూ, భగవన్నామ స్మరణ గావిస్తూ ప్రేమతో జీవితాన్ని ధన్యం చేసుకోండి.

**(14.01.2000 ఉదయం సాయి కుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vachanamrutam